RNI No: APTEL /25/A2860

# సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 11 | పేజీలు : 4 | సోమవారం 13 జూలై 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-

### ఏఐ వచ్చినా.. యుద్ధంలో గెలిచేది సైనికులే

ఏఐ యుద్ధాలు చేసినా గెలిచేది సైనికులేనన్న రాజ్‌నాథ్

విశాఖలో ఐఎన్ఎస్ మహేంద్రగిరి నౌకాదళంలోకి ప్రవేశం

సంప్రదాయ, ఆధునిక సైనిక శక్తి మధ్య సమతుల్యం అవసరం

యుద్ధనౌకల నిర్మాణంతో దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు

'మారిటైమ్ ఇండియా విజన్ 2030'తో ప్రపంచ హబ్‌గా భారత్



# పోలవరం ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించిన సీఎం చంద్రబాబు

పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన సీఎం చంద్రబాబు

హెలికాప్టర్ నుంచి పనులను విహంగ వీక్షణం ద్వారా వీక్షించిన సీఎం

స్పిల్‌వే, కాఫర్ డ్యామ్‌ల మధ్య పనులపై ఆరా

గ్యాప్ 1, గ్యాప్ 2 పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన

సీఎం వెంట మంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం పోలవరం ప్రాజెక్టును పరిశీలించారు. ఏలూరు జిల్లా పర్యటనలో భాగంగా ఆయన హెలికాప్టర్‌లో ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా వీక్షించారు. స్పిల్‌వే నుంచి గోదావరి వరద నీటి ప్రవాహాన్ని, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య జరుగుతున్న పనులను ఆయన విహంగ వీక్షణం ద్వారా పరిశీలించారు. అనంతరం, క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రాజెక్టు పనుల పురోగతిపై ఆరా తీశారు. ముఖ్యంగా ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం (ఈసీఆర్ఎఫ్)లోని గ్యాప్ 1, గ్యాప్ 2 పనులతో పాటు, నిర్మాణంలో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని కూడా ఆయన పరిశీలించారు. ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, పనుల వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఆయన వెంట జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖకు చెందిన ఉన్నతాధికారులు ఉన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది.

## జూనియర్ ఎన్టీఆర్ పొలిటికల్ ఎంట్రీపై పుకార్లు.. క్లారిటీ ఇచ్చిన అభిమాన సంఘం

జులై 18న చేపట్టే 'ఊరు-వాడ' ఓ సేవా కార్యక్రమం అని స్పష్టీకరణ

వదంతులు వ్యాప్తి చేయవద్దని మీడియాకు, సోషల్ మీడియాకు విజ్ఞప్తి

తాత ఎన్టీఆర్, తమిళ నటుడు విజయ్‌తో పోలుస్తూ సాగిన ప్రచారం



ప్రముఖ సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ రాజకీయ అరంగేట్రంపై వస్తున్న ఊహాగానాలకు ఆయన అభిమాన సంఘం తెరదించింది. జులై 18న జరగబోయేది రాజకీయ కార్యక్రమం కాదని, అదొక స్వచ్ఛంద సామాజిక సేవా కార్యక్రమమని స్పష్టం చేసింది. ఈ మేరకు అభిమాన సంఘం ఒక అధికారిక ప్రకటనను విడుదల చేసింది. 'ఊరు-వాడ' పేరుతో గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, వెనుకబడిన వర్గాలకు సేవ చేసే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. ఈ కార్యక్రమానికి రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని, దీనిపై అనవసర ప్రచారం చేసి గందరగోళం సృష్టించవద్దని మీడియాకు, సోషల్ మీడియా వేదికలకు విజ్ఞప్తి చేసింది. ఇటీవల తమిళ నటుడు విజయ్ రాజకీయాల్లోకి రావడం, జూనియర్ ఎన్టీఆర్ తాతగారు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించి టీడీపీని స్థాపించిన చారిత్రక నేపథ్యంతో పోలుస్తూ సోషల్ మీడియాలో విస్తృత చర్చ జరిగింది. దీనికి తోడు 2009 ఎన్నికల్లో టీడీపీ తరఫున ఎన్టీఆర్ ప్రచారం చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఈ ఊహాగానాలు మరింత బలపడ్డాయి. అయితే, అభిమాన సంఘం తాజాగా ఇచ్చిన వివరణతో రాజకీయ వర్గాల్లో నెలకొన్న ఉత్కంఠకు ప్రస్తుతానికి తెరపడినట్లయింది. ప్రస్తుతం అందరి దృష్టి 'ఊరు-వాడ' కార్యక్రమంపైనే ఉంది. ఈ మొత్తం వ్యవహారంపై జూనియర్ ఎన్టీఆర్ స్వయంగా స్పందించాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. తాను నటనపైనే పూర్తి దృష్టి సారించానని, సినిమాల ద్వారా అభిమానులు చూపే ఆదరణే తనకు ముఖ్యమని గతంలో పలు సందర్భాల్లో ఎన్టీఆర్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

పోలవరం, బనకచర్లపై పిటిషన్..

## తెలంగాణకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ



## ఒమర్ అబ్దుల్లాకు బీజేపీ షాక్.. రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసు!



ఎమ్మెల్యేల కొనుగోలుకు బీజేపీ యత్నించిందని ఒమర్ ఆరోపణ

ఏడు రోజుల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని నోటీసులో బీజేపీ డిమాండ్

లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరిక

ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేసిన కాషాయదళం

## మత్స్యకారుల మరణాలపై జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారు...

ఏ ముఖం పెట్టుకుని పరామర్శిస్తారు?

పరామర్శల పేరుతో జగన్ దొంగ నాటకాలు ఆడుతున్నారని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శ

విశాఖ పడవ ప్రమాద బాధితులకు 72 గంటల్లోనే రూ.10 లక్షల సాయం అందించిన ప్రభుత్వం

వైసీపీ హయాంలో 63 మత్స్యకార కుటుంబాలను పట్టించుకోలేదని ఆరోపణ

వేట నిషేధ భృతిని రూ.20 వేలకు పెంచి అందించిన కూటమి సర్కార్

జువ్వలదిన్నెలో చిచ్చుపెట్టాలని చూస్తే ఊరుకోబోమని జగన్‌కు హెచ్చరిక



ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలను దారుణంగా మోసం చేసి, నట్టేట ముంచి, ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని పరామర్శల పేరుతో దొంగ నాటకాలు ఆడుతున్నారని వైసీపీ అధినేత జగన్ పై రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్యకారుల కడుపు కొట్టి, వారి నోటికాడి కూడు లాక్కున్న జగన్ రెడ్డి.. ఇప్పుడు పెద్ద యోగ్యుడిలా పరామర్శల డ్రామాలు ఆడటం సిగ్గుచేటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నం సముద్ర తీరంలో ఇటీవల జరిగిన పడవ ప్రమాదంపై ప్రభుత్వం తక్షణం స్పందించిందని కొల్లు రవీంద్ర తెలిపారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో నేవీ, కోస్ట్ గార్డ్ బృందాలను రంగంలోకి దించి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన మత్స్యకారుడు చిన్నా అందించిన సమాచారంతో 72 గంటల పాటు గాలించినా మిగతా ఆరుగురి ఆచూకీ లభించలేదన్నారు. కోస్ట్ గార్డ్, త్రీ-మెన్ కమిటీ నివేదికల ఆధారంగా వారు మరణించినట్లు నిర్ధారించి, కేవలం 72 గంటల వ్యవధిలోనే బాధిత కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందించామని వివరించారు.

సోమవారం 13 జూలై 2026

# సీమ వార్త సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

## బాలయ్య నోట శభాష్ అనిపించుకున్న...

## చేతన రాయల్.

సౌదీ అరేబియా లో ప్రతిభ చూపుతూ కీలక పదవుల్లో ఉంటూ తెలుగు వారికి అండగా నిలుస్తున్న చేతన.

తండ్రి జగదీష్ తో పాటు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను కలిసిన సంబంధించిన చేతన.

సౌదీలో భారత రాయబార కార్యాలయ సమన్వయకర్త గా, ప్రపంచ లేబర్ మార్కెట్ కాన్ఫరెన్స్ లో స్పీకర్ ప్యానెల్ సభ్యురాలుగా కీలక పదవులు.



**హిందూపురం జులై 13 సీమ వార్త సాయంత్రం.**

హిందూపురం నియోజకవర్గంలోని లేపాక్షి మండలం, గొంగటిపల్లి గ్రామానికి చెందిన చేతన జగదీశ్‌గారి ఇటీవల ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ని సౌదీ అరేబియాలో స్థిరపడ్డ భారత రాయబార కార్యాలయ సమన్వయకర్త, సౌదీ అరేబియా మైగ్రేట్స్ ఫోరం ఇన్ ఆసియా కార్యవర్గ సభ్యురాలు చేతన రాయల్ తన తండ్రి జగదీష్ తో కలిసి బాలకృష్ణ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సౌదీ అరేబియా రాజ్యంలో వలస కార్మికుల సంక్షేమం కోసం తాను చేస్తున్న సేవలను ఆయనకు వివరించారు. ఆమె మైగ్రెంట్స్ ఫోరం ఇన్ ఆసియా కార్యవర్గ సభ్యురాలిగా, భారత రాయబార కార్యాలయం (రియాద్) మహిళా సమన్వయకర్తగా, అలాగే అంతర్జాతీయ కార్మిక సంస్థ కార్యక్రమాలలో సభ్యురాలిగా సేవలందిస్తున్న విషయాన్ని తెలియజేశారు. ఇటీవల జెనీవాలో నిర్వహించిన ఐక్యరాజ్యసమితి గ్రాస్‌రూట్ స్థాయి కార్యక్రమంలో పాల్గొనడం, అలాగే సౌదీ అరేబియాలో జరిగిన వరల్డ్ లేబర్ మార్కెట్ కాన్ఫరెన్స్‌లో స్పీకర్ ప్యానెల్ సభ్యురాలిగా ఎంపిక కావడం వంటి ఆమె విజయాలను బాలకృష్ణ గారు - మిగతా 3లో

## సరస్వతి నిలయంలో... కిక్కు వీరులు వీరంగం..!!



మందు బాబు లకు అడ్డాగా మారిన అప్పరాచెరువు ఎంపీపీ పాఠశాల..!!

పాఠశాల ఆస్తుల ధ్వంసం.. ఉపాధ్యాయులు, విద్యార్థినుల్లో భయాందోళన

పాఠశాల ముగియగానే ఆవరణలో మద్యం సేవిస్తున్న యువకులు

మద్యం సీసాలు, గ్లాసులు, కుర్కురే ప్యాకెట్లతో చెత్తాచెదారం

నీటి పైపులు, కుళాయిలు, గోడలు, పాఠశాల ఆస్తుల ధ్వంసం

మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు, ఆయాలు భయాందోళన

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని పోలీసులను కోరుతున్న ఉపాధ్యాయులు.








## ప్రాణాయామంతోనే.... ప్రశాంతత, ఎనర్జీ

మేనేజ్‌మెంట్‌తో ఏకాగ్రత....ఐక్యూ డెవలప్‌మెంట్‌తోనే విద్యార్థుల ఉజ్వల భవిత!.

ఐక్యూ డెవలప్మెంట్ అవగాహన కార్యక్రమంలో..... రాజయోగి డాక్టర్ భాస్కర్ నాయుడు.

ధర్మవరంలో విద్యార్థులకు యోగ ప్రాధాన్యతపై చైతన్యం కల్పించిన వైనం.

**ధర్మవరం జూలై 13 సీమ వార్త సాయంత్రం.**

ధర్మవరం బాలికల పాఠశాల హెడ్ మాస్టర్. సుమన అధ్యక్షతన విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రముఖ పర్యావరణవేత్త రాజయోగి డాక్టర్ భాస్కర్ నాయుడు హాజరయ్యారు ఈ సందర్భంగా వారు విద్యార్థి దశలో మానసిక ఎదుగుదలకు, చదువులో రాణించడానికి 'ఐక్యూ డెవలప్‌మెంట్' ఎంతవరకు అవసరం? నిత్య జీవితంలో 'ఎనర్జీ మేనేజ్‌మెంట్' (శక్తి నిర్వహణ) - మిగతా 3లో







## కదిరిలో.. కబ్జాలపై కాషాయం కన్నెర్ర..!!

కార్మికుల స్థలాల కబ్జా.. అన్యాయం.

ఆ 500 మంది కార్మికులకు....రెవిన్యూ అధికారులే న్యాయం చేయాలి

కదిరిలో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన.... అర్ డి ఓ కార్యాలయం ముందు ఆందోళన

కదిరిలో భవన నిర్మాణ కార్మికుల స్థలాల కబ్జాలను వెంటనే అడ్డుకోవాలి

కబ్జాకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలి.

యస్, విష్ణు వర్ధన్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులుడిమాండ్.



**కదిరి జులై 13 సీమ వార్త సాయంత్రం.**

500 మంది కార్మికులకు జరిగిన అన్యాయానికి రెవెన్యూ అధికారులు బాధ్యత వహించాలని రాష్ట్ర బిజెపి నాయకులు కృష్ణ వర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. కదిరిపటం లోని భవన నిర్మాణ కార్మికుల స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయని వెంటనే రెవిన్యూ అధికారుల స్పందించి న్యాయం చేయాలని కదిరి పట్టణంలో సోమవారం ఆర్డీవోకు బిజెపి నాయకుడు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ 40 మంది కార్మికుల కుటుంబాల పట్టాలను కబ్జా చేసిన దళారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ పట్టాలు సృష్టించిన వారిని, వారికి సహకరించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేసి చట్టప్రకారం శిక్షించాలని, గత విచారణలో అక్రమాలు తేలినా చర్యలు తీసుకోకపోవడం అత్యంత దురదృష్టకరం అని అన్నారు. - మిగతా 3లో



సీమ వార్త
సాయంకాలం
సోమవారం
13 జూలై 2026

## చప్పిడి మహేష్ నాయుడికు ఘన సత్కారం




**టి.సుండుపల్లి, జూలై 13 సీమ వార్త సాయంత్రం** టీడీపీ నాయకులు చప్పిడి మహేష్ నాయుడికి ఆదివారం సాయంత్రం సిద్ధారెడ్డిగారిపల్లి గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. బాణాసంచా కాల్చి స్వాగతం పలికిన గ్రామస్థులు శాలువా కప్పి, పూలమాల వేసి, కేక్ కట్ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా చప్పిడి మహేష్ నాయుడు మాట్లాడుతూ గ్రామంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మూసా, మున్నా, హబీబ్, చాను, కలీమా, చామీర్, అబ్దుల్, అహమ్మద్, మహమ్మద్, షబ్బీర్, మహమ్మద్ సబ్జార్, సుభహాన్, ఆదమ్ పాల్గొన్నారు.

## కర్ణాటకలో స్థిరపడ్డ... తగ్గని సొంతూరి మమకారం.

**స్వగ్రామం పాల సముద్రంలో....100 మంది విద్యార్థులకు, ట్రిబుల్ ఐటీ సాధించిన 3 విద్యార్థులకు సన్మానం, బహుమతులు.**

**బాలరాజు, కనకలక్ష్మి దంపతులు వచ్చే సేవా కార్యక్రమాలు.**





**గోరంట్ల జులై 13 సీమ వార్త సాయంత్రం.** స్వగ్రామం వదిలి కొన్ని సంవత్సరాల క్రితం కర్ణాటకలోని బెంగళూరులో స్థిరపడినప్పటికీ తమ సొంత ఊరి జనంపై ఉన్న మమకారంతో తన సంపాదనలో ఎంతో కొంత భాగం ఊరికి ఉపయోగించాలన్న ముఖ్య ఉద్దేశంతో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివి విద్యార్థులకు విద్యా సామాగ్రి అందజేసి ఆదర్శంగా నిలిచారు గ్రామానికి చెందిన బాలరాజు, కనక లక్ష్మీ దంపతులు.గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని వంద మంది విద్యార్థులకు హెచ్ఎం నీలం అశోకు సమక్షంలో విద్యార్థులకు పుస్తకాలు మరియు విద్యా సామాగ్రిని అందజేసి చేయూతగా నిలిచారు. అనంతరం ఉపాధ్యాయులు జై చంద్ర నాయక్, నాగలిల, సునంద, సంప్రీతి భాయ్ లను దాతలు ఘనంగా సన్మానించారు.

**ట్రిబుల్ ఐటీ సిటు సాధించిన విద్యార్థులకు సన్మానం...**

మండల బోని పాలసముద్రం ప్రభుత్వ హైస్కూల్లో పదవ తరగతి పాసై ట్రిబుల్ ఐటీ లో సీట్లు సాధించిన విద్యార్థులు ప్రీతి, ధనలక్ష్మి, వరుణ్ సాయి లను బాలరాజు, కనక లక్ష్మీ దంపతులు విద్యార్థులను అభినందిస్తూ సన్మానించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో వడిగేపల్లి మాజీ సర్పంచ్ నరసింహమూర్తి, హై స్కూల్ హెడ్మాస్టర్ రామానుజులు యాదవ్ లతోపాటు ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాలయ్య నోట శభాష్ అనిపించుకున్న... చేతన రాయల్.



-**మొదటిపేజీ** తరువాయి

అభినందించారు. అంతర్జాతీయ వేదికలపై భారతీయ వలసదారుల సమస్యలు, సంక్షేమం కోసం ఆమె చేస్తున్న కృషిని ప్రశంసించారు. అదే విధంగా, హిందూపురం ప్రాంత ప్రజలకు గల్ఫ్ దేశాలలోని ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ఒక డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను చేతన జగదీశ్‌గారి ఆయన ముందుంచారు. ఈ కార్యక్రమం యువతకు సరైన సమాచారం, మార్గదర్శకత్వం అందించడంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె తెలిపారు.

## కదిరిలో.. కబ్జాలపై కాషాయం కన్నెర్ల..!!

-**మొదటిపేజీ** తరువాయి

అసలైన భవన నిర్మాణ కార్మికులకు వారి స్థలాలను వెంటనే అప్పగించాలని,రెవెన్యూ శాఖలో అక్రమాలకు పాల్పడిన వారిపై నిష్పక్షపాత విచారణ జరపాలని అన్నారు.కార్మికుల హక్కులను హరించే భూ మాఫియాపై పోలీసులు చర్యలు తీసుకోవాలని,కార్మికులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం ఆగదన్నారు.బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## సరస్వతి నిలయంలో... కిక్కు వీరులు వీరంగం..!!

**బత్తలపల్లి జూలై 13 సీమ వార్త సాయంత్రం.** బత్తలపల్లి మండలంలోని అప్పరాచెరువు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారిందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయుల కథనం ప్రకారం, ప్రతిరోజూ పాఠశాల ముగిసిన వెంటనే గ్రామానికి చెందిన కొందరు యువకులు పాఠశాల ఆవరణలోకి వచ్చి మద్యం సేవిస్తున్నారు. అనంతరం మద్యం సీసాలు, గ్లాసులు, కుర్కురే ప్యాకెట్లు తదితర చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు. అంతేకాకుండా పాఠశాల ప్రాంగణంలో క్రికెట్ ఆడుతూ విద్యార్థులకు ఉపయోగపడే పరికరాలు, నీటి పైపులు, కుళాయిలు, గోడలు, మెట్లు తదితర ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.ఈ విషయాన్ని పలుమార్లు పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) సభ్యుల దృష్టికి తీసుకెళ్లగా, వారు సంబంధిత యువకులను హెచ్చరించినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదని తెలిపారు. "మీరు చెప్పితే మేము వినాలా" అన్న ధోరణితో మరింత రెచ్చిపోతున్నారని ఉపాధ్యాయులు వాపోయారు.ధ్వంసమైన సామగ్రిని పదేపదే మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, అయినప్పటికీ మళ్లీ వాటిని ధ్వంసం చేస్తున్నారని పేర్కొన్నారు. కొందరు పాఠశాల పూర్తిగా ముగియకముందే ఆవరణలోకి వస్తుండటంతో మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు, ఆయాలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా బత్తలపల్లి సీఐ ప్రభాకర్, ఎస్ఐ శ్రీనివాసులు స్పందించి పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని విద్యాసంస్థను రక్షించాలని ఉపాధ్యాయులు, గ్రామస్థులు కోరుతున్నారు.

## ప్రాణాయామంతోనే....ప్రశాంతత, ఎనర్జీ

-**మొదటిపేజీ** తరువాయి

మరియు 'ప్రాణాయామ క్రియల'ను అలవర్చుకోవడం వల్ల విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి, తమ మేధోశక్తిని ఎలా పెంపొందించు కోవాలో తెలియజేశారు.చివరగా నేను చెప్పేది ఒక్కటే.. మేధస్సుకు ప్రతిరూపం 'ఐక్యూ', దానికి ఇంధనం 'ఎనర్జీ మేనేజ్‌మెంట్', వీటన్నింటినీ నడిపించే శ్వాస 'ప్రాణాయామం'. ఈ మూడింటిని ఎవరైతే తమ విద్యార్థి జీవితంలో అలవర్చుకుంటారో, వారు కేవలం తరగతి గదిలోనే కాదు, రేపటి సమాజంలోనూ ఉత్తమ విజేతలుగా నిలుస్తారు. ప్రాణాయామం ఒత్తిడిని జయించే ఆయుధం మరి ఈ ఐక్యూని, ఎనర్జీని కంట్రోల్ చేసే శక్తి దేనికి ఉందంటే.. అది 'ప్రాణాయామం' కే సాధ్యం. శ్వాసపై ధ్యాస పెట్టడమే ప్రాణాయామం. నిత్యం కొద్ది నిమిషాల పాటు ప్రాణాయామం చేయడం వల్ల మెదడుకు ఆక్సిజన్ సరఫరా పెరిగి, జ్ఞాపకశక్తి మునుపటి కంటే మెరుగవుతుంది. పరీక్షల సమయంలో వచ్చే యాంగ్జైటీ, భయం మరియు మానసిక ఒత్తిడిని దూరం చేయడానికి ఇది ఒక సంజీవనిలా పనిచేస్తుంది. మనసు ప్రశాంతంగా ఉంటే, ఎంత కష్టమైన సబ్జెక్ట్ అయినా సులభంగా అర్థమవుతుం దని వారు తెలియజేశారు తదనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పీడీలు స్వరూప, సరళ జూడో కోచ్ భాష ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## మత్స్యకారుల మరణాలపై జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారు...

-**మొదటిపేజీ** తరువాయి

భారతదేశ చరిత్రలోనే ఇంత వేగంగా సాయం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటనను కూడా జగన్ రాజకీయం చేస్తున్నారని కొల్లు రవీంద్ర మండిపడ్డారు. "ప్రభుత్వం బాధితులకు కొండంత ధైర్యాన్నిస్తే.. మీరు శవ రాజకీయాలు చేయడానికి వెళ్తున్నారా?" అని ప్రశ్నించారు. గతంలో వైజాగ్ హార్బర్‌లో 45 బోట్లు కాలి బూడిదైతే కనీసం పలకరించని జగన్, ఇప్పుడు డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. తన ఐదేళ్ల పాలనలో 63 మంది మత్స్యకారులు సముద్రంలో గల్లంతై చనిపోతే, వారి కుటుంబాలకు డెత్ సర్టిఫికెట్లు కూడా ఇప్పించలేని దౌర్భాగ్యపు ముఖ్యమంత్రి జగన్ అని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ 63 కుటుంబాలకు రూ. 3.15 కోట్ల సాయం అందించి ఆదుకుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులకు అండగా నిలుస్తోందని రవీంద్ర వివరించారు. వేట నిషేధ భృతిని ఏకంగా రూ. 20,000కి పెంచి, రూ. 258 కోట్లకు పైగా నిధులను వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. మత్స్యకారుల చెరువుల హక్కులను కాలరాసేందుకు జగన్ తెచ్చిన దుర్మార్గపు జీవో నెం. 217ను రద్దు చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్ర వాటా ఇవ్వకుండా నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. గతంలో హుద్‌హుద్ తుపాను సమయంలో చంద్రబాబు దెబ్బతిన్న బోట్లకు రూ. 6 లక్షల చొప్పున సాయం అందించారని, వేలమంది ఆక్వా రైతులను ఆదుకున్నారని గుర్తుచేశారు. మత్స్యకారుల రక్షణ కోసం 4,560 శాటిలైట్ ట్రాన్స్‌పాండర్లను ఉచితంగా అందించామని, 9 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాన్ని వేగవంతం చేశామని తెలిపారు. జువ్వలదిన్నె వంటి చోట్ల కులాల మధ్య చిచ్చులు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఐదేళ్ల పాలనలో మత్స్యకారులకు ఏం చేశారో దమ్ముంటే చర్చకు రావాలని జగన్‌కు సవాల్ విసిరారు. మత్స్యకారులకు ఏ మేలు జరిగినా అది తెలుగుదేశం, కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమైందని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

## పోలవరం, బనకచర్లపై పిటిషన్.. తెలంగాణకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ


**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ పిటిషన్**

**పోలవరం, కృష్ణా జలాల వినియోగం, బనకచర్ల అంశాలపై దాఖలైన వ్యాజ్యం**

**ఏపీ చేపడుతున్న పనులపై స్టే విధిస్తూ నోటీసులు జారీ చేయాలని కోరిన తెలంగాణ**

**పిటిషన్‌లో తీవ్ర సాంకేతిక లోపాలున్నాయన్న ధర్మాసనం**

**వాటిని సరిదిద్దకముందే ఏపీకి నోటీసులు జారీ చేయడం కుదరదని స్పష్టీకరణ**



అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పోలవరం ప్రాజెక్టు, కృష్ణా నదీ జలాల వినియోగం, బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ అంశాలపై దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఈ కేసులో మొత్తం 15 మంది ప్రతివాదులు ఉన్నారని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పనులపై తక్షణమే స్టే విధిస్తూ నోటీసులు జారీ చేయాలని కోర్టును తెలంగాణ తరఫు న్యాయవాది కోరారు. అయితే, తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్‌లో తీవ్ర సాంకేతిక లోపాలు ఉన్నాయని ధర్మాసనం గుర్తించింది. వాటిని సరిచేసే వరకు విచారణ చేపట్టలేమని స్పష్టం చేసింది. ప్రాథమిక లోపాలు సరిదిద్దకముందే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయడం గానీ, మధ్యంతర ఉత్తర్వులు (ఇంజెక్షన్/స్టే) ఇవ్వడం గానీ సాధ్యం కాదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ముందుగా పిటిషన్‌లోని లోపాలను సవరించాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచించింది. ఆ తర్వాతే మిగిలిన అంశాలపై విచారణ చేపడతామని పేర్కొంది. అనంతరం కేసు విచారణను వాయిదా వేసింది.

# ఒమర్ అబ్దుల్లాకు బీజేపీ షాక్.. రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసు!

జమ్మూకశ్మీర్‌లో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందంటూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన బీజేపీ, ఒమర్ అబ్దుల్లాకు రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసును జారీ చేసింది. ఏడు రోజుల్లోగా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది.

**అసలేం జరిగింది?**

ఈ నెల 11న తన నాయనమ్మ, 'మదర్-ఎ-మెహర్బాన్'గా పేరుగాంచిన బేగం అక్బర్ జహాన్ 26వ వర్ధంతి సందర్భంగా జరిగిన పార్టీ సమావేశంలో ఒమర్ అబ్దుల్లా బీజేపీపై సంచలన ఆరోపణలు చేశారు. తన నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా జమ్మూ డివిజన్‌కు చెందిన తమ పార్టీ ఎమ్మెల్యేను ఒక సీనియర్ బీజేపీ నేత సంప్రదించారని, పార్టీ మారితే రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్లు, మంత్రి పదవి, జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా ఇస్తామని ఆఫర్ చేశారని ఆరోపించారు. సుప్రీంకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న ఒక సీనియర్ బీజేపీ నేత ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించారని కూడా ఆయన పేర్కొన్నారు.

**నోటీసులో బీజేపీ డిమాండ్లు**

ఒమర్ వ్యాఖ్యలతో తమ పార్టీ ప్రతిష్ఠకు తీవ్ర భంగం కలిగిందని బీజేపీ పేర్కొంది. జమ్మూకశ్మీర్ బీజేపీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు సత్ పాల్ శర్మ ఆదేశాల మేరకు అడ్వకేట్ పరిమోక్ష్ సేథ్ ద్వారా ఈ లీగల్ నోటీసును పంపింది. ఒమర్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమైనవని, దురుద్దేశపూర్వకమైనవని నోటీసులో స్పష్టం చేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయంగా దెబ్బతీసేందుకే ఈ వ్యాఖ్యలు చేశారని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఒమర్ అబ్దుల్లా ఏడు రోజుల్లోగా ఈ ఆరోపణలను లిఖితపూర్వకంగా ఉపసంహరించుకోవాలని, బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం చేయవద్దని కూడా సూచించింది.

**చర్యలకు సిద్ధమన్న బీజేపీ**

గడువులోగా ఒమర్ స్పందించకపోతే రూ.100 కోట్ల నష్టపరిహారం కోరుతూ సివిల్ పరువు నష్టం దావా వేస్తామని బీజేపీ హెచ్చరించింది. దీంతోపాటు చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద క్రిమినల్ చర్యలు కూడా ప్రారంభిస్తామని నోటీసులో స్పష్టం చేసింది. ఈ ఆరోపణలను బీజేపీ మొదటి నుంచి ఖండిస్తోంది. రాజకీయంగా ప్రేరేపితమైన ఈ వ్యాఖ్యల వెనుక తమ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర ఉందని ఆ పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. ఈ నోటీసుతో జమ్మూకశ్మీర్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఒమర్ అబ్దుల్లా దీనిపై ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

## అక్టోబర్ 27న ఇజ్రాయేల్‌లో ఎన్నికలు.. నెతన్యాహు ప్రభుత్వానికి ఆఖరి రోజు అదే..!

పశ్చిమాసియాలో యుద్ధం, అస్థిర పరిస్థితులు కొనసాగుతుండగానే ఇజ్రాయేల్‌లో సార్వత్రిక ఎన్నికలకు తెరలేవనుంది. ఈ ఏడాది అక్టోబర్ 27న ఆ దేశంలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని లీకుడ్ ప్రభుత్వం నాలుగేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్నందున ఎలక్షన్లకు సమయం వచ్చిందని ఆదివారం ఇజ్రాయేల్ మీడియా తెలిపింది. నెతన్యాహు ప్రభుత్వం జూలై 17 వరకే కొనసాగనుంది. ఇజ్రాయేల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వం మరో నాలుగు రోజులే ఉండనుంది. దాంతో, అధికార లీకుడ్ పార్టీ సీనియర్ నాయకుడు అఫిర్ కట్జ్ టైమ్స్ ఇజ్రాయేల్ వార్త సంస్థతో మాట్లాడుతూ.. అక్టోబర్ 27న ఎన్నికలు ఉంటాయని వెల్లడించాయి. 1988 తర్వాత షెడ్యూల్ ప్రకారం నాలుగేళ్లకు జరుగనున్న మొట్టమొదటి ఎన్నికలు ఇవే. అంతేకాదు గత 50 ఏళ్లలో పూర్తికాలం అధికారంలో కొనసాగిన ప్రభుత్వంగా బెంజమిన్ నెతన్యాహు సర్కార్ గుర్తింపు సాధించనుంది.

**జూలై 17 నుంచే**

జూలై 17 నుంచే ఎన్నికల ప్రక్రియ మొదలవ్వనుంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితా సెప్టెంబర్ 7 కల్లా సిద్ధం కానుందని ఇజ్రాయేల్ మీడియా పేర్కొంది. 120 ఎంపీ స్థానాలకు 61 సీట్లు గెలుపొందిన పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. అయితే.. నెతన్యాహు నేతృత్వంలోని లీకుడ్ పార్టీకి, గడి ఐసెన్‌కోట్ సారథ్యంలోని యషార్ పార్టీకి ఎన్నికల్లో తలా 23 సీట్లు వస్తాయని ఓ మీడియా సంస్థ అంచనా వేసింది. మరో సంస్థ మాత్రం ఐసెన్‌కోట్ పార్టీకి సంపూర్ణ ఆధిపత్యం లభిస్తుందని తెలిపింది.

## ఇరాన్ ప్రతీకార చర్యలు

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. తమ దేశ దక్షిణ ప్రాంతాలపై అమెరికా సైన్యం దాడులకు పాల్పడిందని ఆరోపిస్తూ ఇరాన్ తీవ్రంగా స్పందించింది. దీనికి ప్రతీకారంగా జోర్డాన్, ఖతార్, ఒమన్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఆదివారం దాడులు చేసినట్టు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) ప్రకటించింది. అంతటితో ఆగకుండా హర్మూజ్ జలసంధిని తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు మూసివేస్తున్నట్లు స్పష్టం చేసింది. తమ అధికారిక మీడియా సంస్థ సెపాహ్ న్యూస్ ద్వారా ఐఆర్జీసీ ఈ వివరాలు వెల్లడించింది. తమ దక్షిణ తీరప్రాంతాల్లోని పలు సైనిక స్థావరాలు, కమ్యూనికేషన్ టవర్లపై యూఎస్ వైమానిక దాడులు చేసిందని పేర్కొంది. దీనికి ప్రతీకారంగా మూడు దశల్లో దాడులు చేశామని తెలిపింది. మొదటి దశలో జోర్డాన్‌లోని ప్రిన్స్ హసన్ ఎయిర్‌బేస్‌ను లక్ష్యంగా చేసుకుని, అక్కడి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను, ఎంక్యూ-9 రీపర్ డ్రోన్ల హ్యాంగర్‌ను ధ్వంసం చేశామని వివరించింది. రెండో దశలో ఖతార్‌లోని అల్ ఉదెయిద్ ఎయిర్‌బేస్‌పై దాడి చేసి, కమాండ్ సెంటర్‌తో పాటు ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ నిర్వహణ కేంద్రాలను ధ్వంసం చేశామని పేర్కొంది. మూడో దశలో ఒమన్‌లోని దుక్మ్ పోర్టులో ఉన్న అమెరికా లాజిస్టికల్ కేంద్రాలపై భారీ దాడి చేశామని తెలిపింది. ఇరాన్ సైన్యం కూడా కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా స్థావరాలపై కమికాజే డ్రోన్లతో దాడులు చేసిందని, రాడార్ సైట్లు, ఆయుధ డిపోలను ధ్వంసం చేసిందని వెల్లడించింది. అమెరికా మళ్లీ దాడులకు పాల్పడితే మరింత తీవ్రమైన ప్రతిచర్యలు ఉంటాయని ఐఆర్జీసీ హెచ్చరించింది. అమెరికా జోక్యం ఆగే వరకు హర్మూజ్ జలసంధి మీదుగా ఏ నౌకనూ అనుమతించబోమని స్పష్టం చేసింది.

## మంత్రిగారికే షాక్..

సాధారణ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు మారువేషంలో బయలుదేరిన కర్ణాటక రవాణా శాఖ మంత్రి భైరతి సురేశ్‌కు చేదు అనుభవం ఎదురైంది. టికెట్ కోసం చిల్లర లేకపోవడంతో ఓ బీఎంటీసీ బస్సు కండక్టర్ ఆయన్ను బస్సు దిగిపొమ్మన్నారు. ఈ సంఘటన బెంగళూరు నగరంలో చోటుచేసుకుంది.

**అసలేం జరిగిందంటే..!**

మంత్రి భైరతి సురేశ్ నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను పరిశీలించేందుకు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా ఆయన మాస్క్ ధరించి, సాధారణ ప్రయాణికుడిలా హెబ్బాల్ నుంచి నాగశెట్టిహళ్లి వెళ్లేందుకు బీఎంటీసీ బస్సు ఎక్కారు. రెండు టికెట్లు కొని, కండక్టర్‌కు రూ. 100 నోటు ఇచ్చారు. అయితే, కండక్టర్ చిల్లర ఇవ్వాలని అడగ్గా, తన వద్ద లేదని మంత్రి బదులిచ్చారు. దీంతో తన వద్ద కూడా చిల్లర లేదని, సరిగ్గా డబ్బులు చెల్లించలేకపోతే బస్సు దిగిపోవాలని కండక్టర్ స్పష్టం చేశారు. మంత్రి మాస్క్ ధరించి ఉండటంతో కండక్టర్ ఆయన్ను గుర్తుపట్టలేకపోయారు. దీనిపై మంత్రి ఏమీ మాట్లాడకుండా మౌనంగా బస్సు దిగిపోయారు. అనంతరం నాగశెట్టిహళ్లి నుంచి కొద్ది దూరం ప్రయాణించేందుకు మంత్రి ఓ ఆటో ఎక్కారు. మీటర్‌లో ఛార్జీ రూ. 30 చూపించగా, డ్రైవర్ రూ. 36 డిమాండ్ చేశాడు. ఎందుకని ప్రశ్నించగా.. మీటర్‌ను త్వరలో సరిచేయిస్తానని సమాధానమిచ్చాడు. చివరికి మంత్రి అతనికి రూ. 40 ఇచ్చి ఆటో దిగారు. ఈ తనిఖీ ద్వారా ప్రజా రవాణాలో సామాన్యులు పడుతున్న ఇబ్బందులను మంత్రి స్వయంగా తెలుసుకున్నారు.

సీమ వార్త సాయంకాలం

సోమవారం
13 జూలై 2026

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న బెస్ట్ యూనివర్సిటీ

....కండోనేషన్ ఫీజు కడితేనే పరీక్షలు అంటున్న యాజమాన్యం

....ఫీజుల కోసం ప్రాక్టికల్ పరీక్షలుకు అనుమతించకుండా వేధించడం దారుణం

....ఆఫ్లైన్ అటెండెన్స్ పేరుతో పేద విద్యార్థులపై ఫీజుల మోత

....పి ఎస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి చంద్ర



**గోరంట్ల జులై 13 సీమ వార్త సాయంత్రం.** గోరంట్ల మండలంలోని బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ యాజమాన్యం విద్యార్థుల భవిష్యత్తుతో చలగాటం ఆడుతూ, విద్యను వ్యాపారంగా మార్చిందని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి చంద్ర తీవ్రంగా మండిపడ్డారు.
కళాశాలలో ఆఫ్లైన్ అటెండెన్స్‌ను ఇష్టానుసారంగా నమోదు చేస్తూ, గ్రామీణ , పేద విద్యార్థులపై కండోనేషన్ ఫీజు పేరుతో వేలాది రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఫీజులు చెల్లించలేని పేద విద్యార్థులను ప్రాక్టికల్ పరీక్షలకు, సెమిస్టర్ పరీక్షలకు అనుమతించకుండా బ్యాక్ లాగ్ లు పడేలా వారి విద్యా భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడం అత్యంత అమానుషమని అన్నారు.
కండోనేషన్ ఫీజు కట్టకపోతే పరీక్షలు వ్రాయనివ్వం... ఎవరికి చెప్పు కుంటారో చెప్పుకోండి అంటూ విద్యార్థులను బెదిరించడం యాజమాన్య అహంకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. తమ హక్కుల కోసం ప్రశ్నించే విద్యార్థులను ప్రత్యేకంగా టార్గెట్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు.
విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు. దానిని ఫీజు లతో ముడిపెట్టి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. ఉన్నత విద్యాశాఖ అధికారులు వెంటనే కళాశాలపై సమగ్ర విచారణ చేపట్టి, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.
కండోనేషన్ ఫీజు పేరుతో జరుగుతున్న అక్రమ వసూళ్లను వెంటనే నిలిపివేయాలి. ఫీజుల కారణంగా నిలిపివేసిన ప్రాక్టికల్, సెమిస్టర్ పరీక్షలకు విద్యార్థులను వెంటనే అనుమతించాలి. విద్యార్థులను బెదిరిస్తున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల హక్కులు, భవిష్యత్తుకు పూర్తి రక్షణ కల్పించాలి. లేకుంటే బాధిత విద్యార్థులతో కలిసి ఆందోళనలు, ధర్నాలు నిర్వహించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## రేపు చాకర్లపల్లి రైల్వే గేటు మూసివేత




**సోమందేపల్లి జులై 13 సీమ వార్త సాయంకాలం** మండల కేంద్రంలోని చాకర్ల పల్లి సమీపంలో ఉన్న రైల్వే గేటు మరమ్మతులు కారణంగా ఉదయం 7 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. ప్రయాణికులు వాహనదారు లు ప్రజలు తమకు సహకరించాలని రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్యామ్నాయంగా ఇతర రహదారులపై తమ ప్రయాణాన్ని కొనసాగించాలన్నారు.

## శ్రీ వెంకటేశ్వర ఆలయ నిర్మాణానికి.... పెయ్యాల ఫ్యామిలీ లక్ష సాయం.

ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేసిన....
మాజీ సర్పంచ్ పెయ్యాల శివారెడ్డి.



**గోరంట్ల జులై 13 సీమ వార్త సాయంత్రం.** మండలంలోని పాలసంత్రం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వ్యాపారవేత్త నార్సింపల్లి పెయ్యాల శివారెడ్డి తన వంతు బాధ్యతగా లక్ష విరాళం అందజేసి తనకు ఉన్న దైవభక్తిని సమాజ సేవను చాటుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం పెయ్యాల రామలింగారెడ్డి ఫ్యామిలీ తరఫున పెయ్యాల శివారెడ్డి పాలసంద్రంలో నిర్మాణంలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ పెయ్యాల రామలింగారెడ్డి కుటుంబ సభ్యులు ఆలయ నిర్మాణానికి ఇస్తున్న చేయూత మరువలేనిదని ఆ కుటుంబానికి భగవంతుడు దీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## అనంత....ప్రెస్ క్లబ్ ను కాపాడుకుంటాం

....తొలి రోజు రిలే దీక్ష విజయవంతం.

.....-కలెక్టర్ స్పందించాలంటూ.. దిష్టిబొమ్మతో వినూత్న నిరసన.

.... దీక్ష లొ పాల్గొన్న జర్నలిస్టులు బాబ్ జాన్, రామ మూర్తి.



**అనంతపురం జూలై 13 సీమ వార్త సాయంత్రం.** ఎన్నికలు లేక ఏళ్ల తరబడి శిథిలావస్థకు చేరుకుంటున్న అనంతపురం ప్రెస్ క్లబ్ కు తక్షణం ఎన్నికలు నిర్వహించాలంటూ పలువురు సీనియర్, యువ జర్నలిస్టులు ఆదివారం రిలే దీక్ష చేపట్టారు. ఈ రిలే దీక్షకు అనంతపురం నలుమూలల నుండి రాజకీయ పార్టీలకు అతీతంగా, జర్నలిస్ట్ యూనియన్ సంఘాలకు అతీతంగా, కుల, ప్రజా సంఘాలు స్వచ్ఛందంగా మద్దతు తెలిపాయి. రిలే దీక్షలకు ముందు దీక్షా శిబిరంలోనే ఆంధ్రజ్యోతి శింగనమల పాత్రికేయుడు నగేష్ అకాల మరణాన్ని చింతిస్తూ.. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు పాటు మూనం పాటించి ఘన నివాళుల ర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన శిబిరంలో దీక్షకు కూర్చున్న వారిలో చెరుకూరి రామాంజనేయులు, ఐ న్యూస్ రవీంద్ర, రామ్మూర్తి, బాబ్జాన్, త్యాగరాజు, అనంత సూర్య ఎడిటర్ హరికృష్ణ, మనం కుల్లయప్ప, కుంచపు భాస్కర్ ఉన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దిష్టిబొమ్మపై ప్రెస్ క్లబ్ నామకరణ చేసి చనిపోతుంది కాపాడండి అంటూ అయ్యా కలెక్టర్ స్పందించి ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధాన డిమాండ్లను ప్రస్తావిస్తూ.. ప్రెస్ క్లబ్ కు తక్షణం ఎన్నికలు నిర్వహించాలని, సభ్యత్వాల పేరుతో వసూలు చేసిన మొత్తాలను బహిర్గతం చేయాలని, ప్రెస్ క్లబ్ పారదర్శకత ఎన్నికలకు జిల్లా కలెక్టర్ చొరవ చూపాలని డిమాండ్ చేశారు. మద్దతు తెలిపిన వారిలో బీజేవైఎం రాష్ట్ర నాయకులు అజేష్ యాదవ్, నిరుద్యోగుల ఐక్యవేదిక టీపీ రామన్న, జననాడు ఉప్పర నవీన్, తెలుగు వెలుగు సాహిత్య రాష్ట్ర నాయకులు టీవీ రెడ్డి, వైసిపి ట్రేడ్ యూనియన్ నాయకులు అనిల్ కుమార్ గౌడ్, సీనియర్ అడ్వకేట్ నాగన్న, ఈడిగ సంఘం నాయకులు నాగేంద్ర, మహేష్, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు ఆజాద్, భూపాలం సతీష్, భికారి, పి గోపాల్, బాబ్జాన్, కుమార్, ధర్మపీఠం రామాంజనేయులు, సదరం రవి,ఉపేంద్ర, మూర్తి, సాకే బాల పెద్దన్న, కృష్ణమ నాయుడు, బికేస్ కిష్ట, నార్పల వలి, ఫోకస్ మల్లికార్జున, ఇంకా వందలాదిగా జర్నలిస్టు లు స్వచ్ఛందంగా తరలివచ్చారు.

## వివాదాస్పద పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు ఎస్ఐ మహేష్



**టి సుండుపల్లి జులై 13 సీమ వార్త సాయంత్రం.** మండల పరిధిలోని వాట్సాప్ గ్రూపుల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అసభ్యకర పోస్టులు, వివాదాస్పద సందేశాలు ప్రచారం చేస్తే సంబంధిత గ్రూప్ అడ్మిన్‌లపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొందరు గ్రూపులుగా విడిపోయి ఇతరులను రెచ్చగొట్టేలా పోస్టులు చేస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వాట్సాప్ గ్రూపులపై పోలీసులు నిఘా ఉంచినట్లు తెలిపారు. సామాజిక శాంతి భద్రతలకు భంగం కలిగించే పోస్టులు, తప్పుడు ప్రచారాలకు దూరంగా ఉండాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మహేష్ స్పష్టం చేశారు.


## శ్రీకాంత్ సాయంతో..... సొంత ఊరు జనానికి వైద్య సాయం.

టిడిపి యువ నాయకుడు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో నిమ్మల శ్రీధర్ పర్యవేక్షణలో వైద్య శిబిరం.

తిరుపతి రమాదేవి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారిచే... సింగిరెడ్డిపల్లి లో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన.

హాజరైన టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఉమా శంకర్.







**గోరంట్ల జులై 13 సీమ వార్త సాయంత్రం.** రాజకీయమంటే పదవులు సంపాదనే కాదు ప్రజాసేవ కూడా ముఖ్యమేనని భావించిన తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు శ్రీకాంత్ యాదవ్ తన సొంత ఊరులో అంత ప్రజల కోసం తనవంతుగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పేద ప్రజలకు ఉపయోగపడ్డాడు. గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని సింగిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం టిడిపి యువ నాయకులు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో టిడిపి సీనియర్ నాయకులు నిమ్మల శ్రీధర్ పర్యవేక్షణలో గ్రామ నడిబొడ్డున తిరుపతి రమాదేవి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వారిచే ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని సింగిరెడ్డి పల్లి గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరానికి శ్రీకాంత్ యాదవ్ పిలుపుమేరకు నాయకులు టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఉత్తమ రెడ్డి, సింగిల్ బిండో అధ్యక్షులు రవి మోహన్, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, పులేరు మఠం శ్రీనివాసులు, ఎస్సీ ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు ఉమాశంకర్, నరేష్ యాదవ్, అజంతుల్లా, ఉమర్ ఖాన్ లు హాజరై కార్యక్రమంలో పాలు పంచుకున్నారు. ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ రాజకీయం అంటే ప్రజలకు సేవ చేయడమని భావించిన యువ నాయకుడు శ్రీకాంత్ యాదవ్ చేస్తున్న పనులు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు లక్ష్మీపతి, కురుబ మహేంద్ర, మల్లాపల్లి నవీన్, సింగిరెడ్డిపల్లి శేఖర్, నరసురం, ప్రభాకర, సిద్ధప్ప, వాల్మీకి వెంకటేష్, వెంకటాచలం, సుభహన్, దాదు, మల్లికార్జున, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పి4 సాయం.. మారమ్మ గుడికి మైకు. టిడిపి నేత చందమూరి సుబ్బారెడ్డి సాయం.



**గోరంట్ల జులై 13 సీమ వార్త సాయంత్రం.** గోరంట్ల మండలంలోని గడ్డం తాండ పంచాయతీ పరిధి లొ గల గడ్డం తాండ మారెమ్మ గుడికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు చందమూరి సుబ్బారెడ్డి మైకు సెట్టు ను విరాళంగా ఇచ్చి తన దైవభక్తిని సొంతం పంచాయతీ ప్రజలపై ఉన్న మమకారాన్ని చాటుకున్నారు.గతంలో హామీ ఇచ్చిన మేరకు తెలుగుదేశం పార్టీ మండల సీనియర్ నాయకులు పి4 సాయం లొ భాగంగా సోమవారం గ్రామ పెద్దలు పంచాయతీ అధ్యక్షులు గోవింద నాయక్, ఉపాధ్యక్షులు లక్ష్మి రాం నాయక్, పాండురంగ నాయక్, బూత్ కో కన్వీనర్ లక్ష్మీ రాం నాయక్ లకు నూతన మైకు సెట్ ను సుబ్బారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు షణ్ముఖ నాయక్ పలువురు పాల్గొన్నారు.

## హిందూ ముస్లింల ఐక్యతకు నిదర్శనం ఉరుసు వేడుకలు.

.....ఉరుసు మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి.



**పోరుమామిళ్ల జూలై 13 సీమ వార్త. సాయంత్రం.** బద్వేల్ నియోజకవర్గంలోని పోరుమామిళ్ల పట్టణంలో హజరత్ గంజె షహీద్ స్వాముల వారి పవిత్ర ఉరుసు మహోత్సవం సందర్భంగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ సభ్యులు, ముస్లిం పెద్దలు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి గారికి శాలువా కప్పి ఘనంగా సన్మానించి ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం దర్గా కమిటీ సభ్యులు ఉరుసు మహోత్సవం యొక్క విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను ఎమ్మెల్సీ గారికి వివరించారు. ఈ ఉరుసు వేడుకలు ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వం, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మాట్లాడుతూ, అన్ని మతాలు శాంతి, ప్రేమ, మానవతా విలువలను బోధిస్తాయని అన్నారు. మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ గౌరవించడం భారతీయ సంస్కృతి గొప్పతనమని పేర్కొంటూ, సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం, సోదరభావం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు, ముస్లిం పెద్దలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జడ్పిటిసి, పార్టీ మండల అధ్యక్షులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు , రాష్ట్ర మరియు జిల్లా మరియు మండల అనుబంధ విభాగాల నాయకులు కార్యకర్తలు, అభిమానులు మరియు పలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపాలయ్య మృతికి నివాళులర్పించిన సూర్యనారాయణ.

....కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం.





**బద్వేల్ జూలై 13 సీమ వార్త సాయంత్రం.** బద్వేల్ నియోజకవర్గం అట్లూరు మండలం వేమలూరు గ్రామం (స్వగ్రామం)కు చెందిన గొడుగునూరు తిరుపాలయ్య గారి మృతిపట్ల ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మరియు బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తన సొంత స్వగ్రామమైన వేమలూరుకు చేరుకున్న సూర్యనారాయణ రెడ్డి తిరుపాలయ్య గారి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కొని మనోధైర్యంతో ముందుకు సాగాలని ఓదార్చారు. మృతుని కుటుంబానికి సహాయంగా రూ.10,000 (పది వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేసి, కష్టకాలంలో తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని గొడుగునూరు తిరుపాలయ్యకి ఘన నివాళులర్పించారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881